భోలక్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ విద్యాబోధన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీధర్, హెచ్‌ఎం స్వరూప

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులకు విద్యాబోధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని సికింద్రాబాద్ ఉప విద్యాధికారి శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూపలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప విద్యాధికారి శ్రీధర్ మాట్లాడుతూ ఏఐ ఆధునిక విద్యాబోధనతో విద్యార్థులకు మెరుగైన ఫలితాలు అందుతాయి.

లాలాపేట: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచడానికి ప్రభుత్వం ఏఐ (కృత్రిమ మేధ) టూల్స్ ద్వారా బోధనను ప్రారంభించినట్లు మారెడుపల్లి జోన్ డిప్యూటీ ఈఓ. బాలూ నాయక్, మండల డిప్యూటీ ఐఓఎస్ మదన్ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం తార్నాక డివిజన్ లాలాపేటలోని మార్కెట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. తిరుపతిరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

‘సోలార్’ స్పెషల్

విద్యుత్ బిల్లు ఆదా చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

కరెంటు భారం భారీగా తగ్గింపు..

ఆదర్శం.. మోడల్‌కాలనీ ‘పూజిత’ అపార్ట్‌మెంట్ వాసులు

ఏడాదికి రూ. 3.50లక్షల ఆదా



పూజిత అపార్ట్‌మెంట్స్‌పై ఏర్పాటుచేసిన సోలార్ పలకలు

సనత్‌నగర్: విద్యుత్ బిల్లుల జారీలో అమలవుతోన్న స్లాబ్ విధానంతో బిల్లు తడిసి మోపెడవుతోంది. ఎందుకంటే విద్యుత్ వినియోగాన్ని బట్టి అత్యధిక స్లాబ్‌లోనే బిల్లులు వస్తుంటాయి. వ్యక్తిగత గృహ అవసరాల మాట అటుంచితే..ఆ అపార్ట్‌మెంట్‌లో అందరికీ కామన్ అవసరాలైన లిఫ్ట్, మోటార్, పంప్‌లు, లైట్లు ఇతర విద్యుత్ ఆధారిత ఎలక్ట్రానిక్ వస్తువులను ఉపయోగించే క్రమంలో నెలకు సుమారు రూ.45వేల వరకు బిల్లు వస్తుంటుంది. ఇప్పుడు ఆ ఖర్చును వారు రూ.15 వేల లోపునకు తీసుకువచ్చారంటే సోలార్ ‘పవర్’ కారణం. సోలార్ వ్యవస్థతో పొందుతున్న ఫలితాలను ఇతరులకు ప్రత్యక్షంగా చూపిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వారే సనత్‌నగర్ మోడల్‌కాలనీకి చెందిన ‘పూజిత’ అపార్ట్‌మెంట్ నివాసితులు.

90 ప్లాట్స్..18 కిలోవాట్స్ సామర్థ్యం..

‘పూజిత’లో మొత్తం మూడు బ్లాక్‌లు ఉండగా రెండు బ్లాక్‌లకు అనుసంధానం చేస్తూ గత నాలుగేళ్ల క్రితం సోలార్ వ్యవస్థను ఏర్పరచుకున్నారు. కావ్య బ్లాక్‌లో 70, శ్రావ్య బ్లాక్‌లో 20 మొత్తం 90 ప్లాట్లదారులకు టాటా సోలార్ పవర్ సహకారంతో నెలకు 18 కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ పలకలను ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం ఆయా అపార్ట్‌మెంట్ల కామన్ అవసరాలకు పవర్‌ను ఉపయోగించుకుంటున్నారు. అందులో భాగంగా లిఫ్ట్, కరెంటు మోటార్లు, పంప్‌సెట్లు, కామన్ ఏరియాలో లైటింగ్ వ్యవస్థలను సోలార్ పవర్ ఆధారంగా నడిపిస్తున్నారు. దీని కోసం దాదాపు రూ.11 లక్షల వరకు ఖర్చు చేశారు. అలా అని అపార్ట్‌మెంట్ నివాసితులపై ఎలాంటి భారం లేకుండా నెలనెలా చెల్లించే మెయింటెనెన్స్ చార్జీలను ఆదా చేసుకుంటూ వచ్చి అందులో నుంచే ఆ మొత్తాన్ని వెచ్చించి సోలార్ పవర్‌ను జనరేట్ చేసే సిస్టంను ఏర్పరచుకున్నారు.

ముందుచూపుతో సోలార్‌ను ఏర్పాటుచేసుకున్నాం



కరెంటు ఛార్జీలు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఛార్జీలు పెరుగుతూనే ఉంటాయి. ఈ క్రమంలో కరెంటు ఛార్జీల చెల్లింపు అనేది ఆర్థిక భారమే. దీనిపై ఆలోచించి సోలార్ సిస్టమ్ ఏర్పాటుచేసుకుంటే ఆ భారం తగ్గించుకోవచ్చు కదా? అని ఆలోచన చేసి సోలార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. సోలార్‌పై తాము పెట్టిన పెట్టుబడి ఆదా రూపంలో ఇప్పటికే వచ్చేసింది. సోలార్‌తో నెలకు 28-30 వేల రూపాయలు, సంవత్సరానికి రూ.3.60 లక్షలు ఆదా చేసి చూపిస్తున్నాం.

- శశిధర్‌రెడ్డి, పూజిత అపార్ట్‌మెంట్

నెలకు రూ.30 వేల వరకు ఆదా..

సోలార్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురాకముందు నెలకు వీరికి రూ.42 నుంచి 45 వేల వరకు కరెంటు ఛార్జీలను చెల్లించేవారు. ప్రస్తుతం కేవలం రూ.13 నుంచి 15 వేల లోపు మాత్రమే మెయింటెనెన్స్ ఛార్జీలు వస్తున్నాయి. అంటే నెలకొచ్చేసరికి 28-30 వేల వరకు ఆదా అవుతోంది. సంవత్సరానికి రూ.3.60 లక్షల వరకు ఆదా చేస్తున్నారు. ఒకసారి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే దాని జీవితకాలం 25 సంవత్సరాల వరకు ఉంటుంది. దీనిని బట్టి రూ. 90 లక్షల వరకు సేవ్ చేసుకున్నట్లే అన్నమాట. ఇది ఇప్పటి విద్యుత్ స్లాబ్ రేట్ల ప్రకారం మాత్రమే. 25 సంవత్సరాల్లో కరెంటు ఛార్జీలు పెరిగే అవకాశం లేకపోలేదు. దీనిని బట్టి వారు కోటి రూపాయల వరకు ఆదా చేసుకున్నట్లే మరి.

సోలార్ వ్యవస్థ.. చాలా ఉపయోగం



సోలార్ పవర్ ద్వారా మెయింటెనెన్స్ చార్జీలు చాలావరకు తగ్గిపోయాయి. ఫ్లాట్ల నివాసితులపై ఆర్థిక భారం తగ్గింది. కేవలం నెలనెలా అందించే మెయింటెనెన్స్ ఛార్జీలను ఆదా చేసుకుంటూ ఎవరిపై అదనపు భారం లేకుండా సోలార్‌ను ఏర్పాటుచేసుకుంది. సత్ఫలితాలను అందిస్తోంది.

- వీరారెడ్డి, పూజిత అపార్ట్‌మెంట్.

నూతన కమిటీ ఎన్నిక



అమీర్‌పేట: అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సజ్జ శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా వి.మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా నవీన్, పవన్, గురునాథ్‌రెడ్డి ఎన్నికైయ్యారు.

కార్పొరేటర్ దంపతులను ఆశీర్వదించిన కవిత



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ దంపతులను ఎమ్మెల్సీ కవిత శనివారం ఆశీర్వదించారు. గతవారం జరిగిన వివాహానికి కవిత హాజరుకాలేకపోయారు. దీంతో శనివారం కార్పొరేటర్ నివాసానికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బేగంపేట ఖాళీ స్థలంలో అగ్ని ప్రమాదం

సనత్‌నగర్: బేగంపేటలోని అమెరికన్ కాన్సులేట్ పాత కార్యాలయానికి కూతవేటు దూరంలోని ఖాళీ స్థలంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఖాళీ స్థలంలోని చెత్త, ఎండిపోయిన చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సిబ్బంది నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అంతకముందు ఉదయం కూడా ఇక్కడి ఖాళీ స్థలంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు నీళ్లు చల్లి మంటలను ఆర్పారు.

మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్ : నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురి శస్త్ర చికిత్సల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ఎల్ఓసీలను అందించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు వైద్యం తదితర అత్యవసర సందర్భాల్లో సీతాఫలమండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.



సీఎం సహాయనిధి ఎల్ఓసీలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

వయోవృద్ధుల కోసం నేడు ప్రత్యేక వైద్య శిబిరం

సనత్‌నగర్: శ్రీనివాస సమాజ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యల దృష్ట్యా వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు గతంలో ప్రత్యేకంగా వృద్ధుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో శ్రీనివాస సమాజ ఛారిటబుల్ ట్రస్ట్ మొట్టమొదటిసారిగా వారి ఆరోగ్యం కోసం ఈ శిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు, స్వతహాగా ఇంట్లోనే పరీక్షలు జరుపుకునేందుకు వీలుగా పలు రకాల టెస్టింగ్ పరికరాలను అందించనున్నారు. బీకేగూడలో గల ట్రస్టీ పార్థసారధి నివాసం వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుంది.

బౌద్ధనగర్‌లో సమస్యలు పరిష్కరిస్తా



బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: బౌద్ధనగర్‌లో ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి బౌద్ధనగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ముందుగా బౌద్ధనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్స్ ను తొలగించి సిమెంట్ పోల్స్ వేయాలని సూచించారు.అదే విధంగా పోల్స్‌పై పెద్ద మొత్తంలో ఉన్న కేబుల్స్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. బస్తీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, డీసీ రజనీకాంత్, డీఈ వాసుదేవరెడ్డి, హరిశంకర్ పాల్గొన్నారు.

దివాళా తీసిన జీహెచ్‌ఎంసీ, జలమండలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

లాలాపేట: జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ బోర్డు దివాళా తీశాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. లాలాపేట శాంతినగర్‌లో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి 75 శాతం ఆదాయం హైదరాబాద్ మహా నగరం నుంచే వస్తోందని, అయితే హైదరాబాద్ ప్రజలకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పించలేకపోతోందని తీవ్రంగా విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లుగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి విమర్శించారు.

వర్గీకరణ మేరకు నియామకాలు చేపట్టాలి

కంటోన్మెంట్: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణకు చట్టం తీసుకువస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు కూడా ఎస్సీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం బోయినపల్లి మార్కెట్ సెంటర్లో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకిషన్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల గత 70 ఏళ్లుగా ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో మంద మధుకర్ మాదిగ, అజిత్ కళ్యాణ్ వాల్మీకి, మధు, బాబెందర్, జగదీష్ మాదిగ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి

అమీర్‌పేట : అమీర్‌పేట డివిజన్‌లోని వివిధ చోట్ల మంచినీరు లో ప్రెషర్‌తో సరఫరా అవుతోందని.. సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరీ జలమండలి అధికారులను కోరారు. శనివారం జలమండలి జీఎం హరిశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వేసవి ప్రారంభంలోనే నీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరారు.

వడ్డీ మినహాయింపును సద్వినియోగం చేసుకోవాలి

సికింద్రాబాద్: ఆస్తి పన్ను బకాయిదారులు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వడ్డీ మినహాయింపును సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సీతాఫల్‌మండి కార్పోరేటర్ సామల హేమ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణి కోరారు. సీతాఫల్‌మండిలో సమావేశమైన ఇరువురు డివిజన్ పరిధిలోని ఆస్తిపన్ను బకాయిల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్తిపన్ను బకాయిల్లోంచి 90 శాతం వడ్డీని మాఫీ జీఓను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకుని ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ, సంధ్యారాణి

మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ

సనత్‌నగర్: శ్రీజగన్నాథ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్)లో ‘అఖండ అష్టమ్ ప్రహారీ’ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ నామ స్మరణతో హనుమాన్ ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రత్యేక మండపాన్ని ఏర్పాటుచేసి అందంగా ముస్తాబు చేసి శ్రీకృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి పాటలు, భజనలతో భక్తి భక్తులు భక్త తన్మయత్వంలో మునిగిపోయారు. బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్

ఉత్సాహంగా హోలీ వేడుకలు



సనత్‌నగర్: బేగంపేటలోని పోలీస్ హాకీగ్రౌండ్‌లో కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం కూడా హోలీ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పర్యావరణ అనుకూలమైన సేంద్రీయ రంగులతో వేడుకలు నిర్వహించారు. ఐదు గంటల పాటు సాగిన కంట్రీ క్లబ్ హోలీ గాలా, బాలీవుడ్, ధోల్, తమటినో, కలర్ స్ప్లాష్ కోలాహలంగా జరిగింది. అంతర్జాతీయ డీజేలు లైవ్ మ్యూజిక్ ఫెర్ఫార్మెన్స్‌తో అందరినీ హుషారెక్కించారు. కంట్రీ క్లబ్ హాస్పటాలిటీ అండ్ హాలీడేస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మెదక్ జిల్లా మక్కరాజ్‌పేట్‌కు చెందిన యెన్నబోయిన మహేశ్ (23) బేగంపేట్‌లో ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెందిన మహేశ్ మేడ్చల్-డబీల్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్యలోకి చేరుకుని పోతిగాయి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జలమండలి సెక్షన్ మేనేజర్‌గా సయ్యద్ సలీం

బన్సీలాల్‌పేట్: మారేడ్‌పల్లి డివిజన్ జలమండలి బోయిగూడ సెక్షన్ మేనేజర్‌గా సయ్యద్ సలీంను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నూతన మేనేజర్‌గా సయ్యద్ సలీం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన బ్రహ్మారెడ్డి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ సయ్యద్ సలీం మాట్లాడుతూ సకాలంలో మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు ...ఇతరత్రా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఇదిలా ఉండగా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ సలీంను బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు ఎల్. వెంకటేషన్ రాజు సత్కరించారు.



మేనేజర్ సయ్యద్ సలీంను సత్కరిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు


త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి

అడ్డగుట్ట: పెండింగ్‌లో ఉన్న అడ్డగుట్ట కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు వీలైనంత తొందరగా పూర్తి చేయనున్నట్లు కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన అడ్డగుట్ట కమ్యూనిటీహాలు నిర్మాణ పనులను శనివారం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సుభాష్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ సుమారు రూ. 1.45 కోట్ల వ్యయంతో పనుల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ నిర్మాణం పూర్తి అయితే ఎంతో మంది పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ తివారి, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.



నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీహాలును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్న, డీసీ సుభాష్‌రావు

ఘనంగా కాన్షీరాం జయంతి



లాలాపేట: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి వేడుకలలు శనివారం లాలాపేట వినోభానగర్ కమ్యునిటీ హాల్లో ఘనంగా జరిగాయి. బీఎస్పీ నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్‌కృష్ణ, సికింద్రాబాద్ జిల్లా ఇంచార్జి, బక్కూరి నర్సింగ్‌రావు, జిల్లా అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ నుంచి నేరుగా కంపెనీల్లోకే వెళ్లాలి

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు క్యాంపస్‌లో చదువు పూర్తి అయిన తరువాత నేరుగా కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ ఎంబీఏ కాలేజ్‌లో శనివారం దేశంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు, సీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్య పూర్తి కాగానే ఉద్యోగం సంపాదించేలా స్కిల్స్ అందించాలని, అలాగే ఎక్కడెక్కడ ఉద్యోగాలు ఉన్నాయో గుర్తించి ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు విద్యార్థులకు సహాయకారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ మేరీస్ ఎంబీఏ కాలేజ్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఆంటోని వినయ్, అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జయరామ్, ఉపాధ్యక్షులు ప్రశాంత్ ఇమ్మానుయేల్, కార్యదర్శి సతీష్ శ్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇక్కడ వైద్యం.. నేతిబీర చందం

- లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో అందని వైద్యం
- ఇక్కడ సౌకర్యాలూ అంతంతే..
- పట్టించుకోని పాలకులు



లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం



పెంటదిబ్బగా మారిన హాస్పిటల్ పార్క్

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం సరిగా అందక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లలకు వైద్యం అందించడం ప్రధాన ఉద్దేశ్యం. దీంతో పాటు జనరల్ వైద్య సేవలు సైతం ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అయితే వైద్యులు, సిబ్బంది కొరతతో సరైన వైద్యం అందడం లేదు. దీనికి తోడు పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ పరిసరాలు, పార్కు నిర్వహణ అధ్వానంగా తయారైంది. హాస్పిటల్‌కు వచ్చే పేషెంట్లకు, బంధువులకు కనీస సౌకర్యాలు లభించడం లేదు. తాగునీరు, టాయిలెట్ వసతి, వెయింటింగ్ రూం వంటి సౌకర్యాలు లేక అక్కడికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు.

రక్షణ కరువైన వైనం.

రాత్రి వేళల్లో పట్టణ ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువైంది. గుర్తు తెలియని వ్యక్తులు హాస్పిటల్ పార్కు గోడదూకి మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో ఇటీవల ఏసి కంప్రెషర్ వైర్లు దొంగిలించుకెళ్లారు. ఈ విధంగా హాస్పిటల్‌కు రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక హాస్పిటల్ చుట్టు ఉన్న పార్కు పూర్తిగా పెంటదిబ్బగా మారింది. సేదతీరాల్సిన పార్కులో క్రిమి కీటకాలు స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి. ఈ విషయమై హాస్పిటల్ అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారులకు ఇప్పటికే రాతపూర్వకంగా తెలియజేశామని చెబుతున్నారు. అధికారులుఇప్పటికైనా స్పందించి ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించి వైద్యం అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ హుండీల లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ ఎస్ఆర్‌నగర్ గురుమూర్తినగర్ వినాయక స్వామి, బాపూనగర్‌లోని వీరాంజనేయ వెంకటేశ్వర షిర్డీ సాయిబాబా ఆలయ హుండీలను శనివారం లెక్కించారు. వినాయ దేవాయలం హుండీల ద్వారా ఆలయానికి రూ.1,99,55,000, వీరాంజనేయ ఆలయానికి రూ.46, 309 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి నరేందర్‌రెడ్డి తెలిపారు.

భవిష్యత్తులో రాజ్యాంగానికి ముప్పు

ఉస్మానియా యూనివర్సిటీ: బీజేపీ పాలనతో భవిష్యత్తులో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ డా.పిడమర్తి రవి, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ పేర్కొన్నారు. శనివారం కాన్షీరాం జయంతి సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) 5వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ ర్యాలీని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గిరిజన శక్తి నాయకులు వెంకటేష్ చౌహాన్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకట్ పాల్గొన్నారు.